క్లుప్తంగా

నూకాంబిక అమ్మవారి ఆలయానికి పోటెత్తిన భక్తులు



నూకాంబికా అమ్మవారి దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు

ఆలమూరు: శ్రీచింతలూరు నూకాంబిక అమ్మవారి జాతర, తీర్థోత్సవాలకు సంబంధించి భక్తుల తాకిడి కొనసాగుతోంది. ఆదివారం కావడంతో పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి నూతన వస్త్రాలు, పసుపు కుంకుమలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. చిన్నారుల చేత కాగడాలు వెలిగించి వారకళ్లు, తుళ్లబిళ్లను దిష్టి తీయించారు. గ్రామ పంచాయతీ కార్మికులు తీర్థంలో పేరుకుపోతున్న చెత్త, చెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగించి పారిశుద్ధ్యాన్ని నెలకొల్పుతున్నారు. వాహనాలన్నింటిని తీర్థంలోకి అనుమతించడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. భక్తుల తాకిడికి అనుగుణంగా ఆలయంలో కనీస సౌకర్యాలను కల్పిస్తున్నామని దేవదాయశాఖ ఈఓ ఎంఎస్ఆర్ కృష్ణ, జేఏ డి.భాస్కర శ్రీనివాస్ తెలిపారు.

తోటల్లో దుక్కులు



అంబాజీపేటలో ఎడ్లతో దుక్కి దున్నుతున్న రైతులు

అంబాజీపేట: రైతులు ఎడ్లు, నాగలి ఉపయోగించి తమ తమ కొబ్బరి, అరటి, ఖోఖో, వరి చేలల్లో సాంప్రదాయబద్ధంగా దుక్కి దున్నుతున్నారు. పూర్వ కాలం నుంచి రైతులు తమ కొబ్బరి తోటలను, వరిచేలను దున్నేందుకు ఎడ్లు, నాగలిని ప్రస్తుత కాలంలోను వాడుతున్నారు. పశు పోషణ కష్టం కావడం, నిర్వహణ వ్యయాలు ఎక్కువైనప్పటికీ ఏరువాక చేసిన సాగు ఎంతో లాభదాయకమని రైతులు చెబుతున్నారు. రోజుకు రూ.వెయ్యి వంతు అద్దె ప్రాతిపదికన ఏరువాకను కొంత మంది రైతులు అనవాయితీగా నిర్వహిస్తున్నారు.

చలివేంద్రాల ప్రారంభం



మందపల్లి వంతెన వద్ద చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ చేస్తున్న విజయలక్ష్మి

కొత్తపేట: మండలంలోని మందపల్లి ఉమా మందేశ్వర (శనైశ్చర) దేవస్థానం ద్వారా వేసవి చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. ఏటా వేసవి సీజన్‌లో రావులపాలెం-కొత్తపేట ప్రధాన రహదారిలో వాహనదారుల దాహార్తి తీర్చేందుకు చల్లటి మజ్జిగతో వేసవి చలివేంద్రాలు ఏర్పాటు చేస్తారు. దానిలో భాగంగా దేవదాయ-ధర్మదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్, దేవస్థానం ఈఓ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో మందపల్లి పెద్ద వంతెన సమీపంలో ఒకటి, ఏనుగుల మహల్ చిన్నవంతెన వద్ద ఒకటి చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో శనైశ్చర ఆలయ ప్రధాన అర్చకుడు అయిలూరి శ్రీరామమూర్తి, దేవస్థానం సూపరింటెండెంట్ మాచిరెడ్డి వెంకటేశ్వరరావు, ఎస్ఏ రవికుమార్ పాల్గొన్నారు.

హోమియో వైద్యశాల ప్రారంభం



వైద్యశాల సేవలను వివరిస్తున్న నిర్వాహకులు

కె.గంగవరం: పాత కోట గ్రామంలో ఆదివారం ది వరల్డ్ టీచర్ ఆధ్వర్యంలో ఉచిత హోమియో వైద్యశాలను ప్రారంభించారు. ఇప్పటి నుంచి ప్రతి ఆదివారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు ఉచితంగా పరీక్షలు చేసి మందులు కూడా ఉచితంగా అందిస్తారని నిర్వాహకులు తెలిపారు. ఈ వైద్యశాలను విశాఖపట్నానికి చెందిన సద్గురు పీఠం అధ్యక్షుడు గురు ప్రసాద్, కార్యదర్శి బీఆర్‌కే రాజు ప్రారంభించారు. కాకినాడ, రాజమహేంద్రవరానికి చెందిన ప్రముఖ్య హోమియో వైద్యులు ఈ వైద్యశాల వద్ద పరీక్షలు చేస్తారని గ్రామీణ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వీర రాఘవ, జీఆర్ఎస్ఎస్ శర్మ, వర్షా, యశస్వి, ఐశ్వర్య తదితరులు పాల్గొన్నారు.

అన్నసమారాధనలు

అంబాజీపేట: శ్రీరామ నవమి వేడుకలను పురస్కరించుకుని మండలంలో రామాలయాల వద్ద ఆదివారం అన్నసమారాధనలు నిర్వహించారు. మాచవరం పోతాయిలంక పెచ్చెట్టివారిపాలెం, అంబాజీపేట కొర్లపాటివారిపాలెం, పుల్లేటికుర్రు బొంతు వారిపేట తదితర ప్రాంతాల్లో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నసమారాధనలు చేశారు. అంతకు ముందు శ్రీరామునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని గెలిపించండి

- కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి
- వైఎస్సార్ సీపీలో భారీ చేరికలు



చొప్పెల్లలో పార్టీ కండువాలు వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

ఆలమూరు: చొప్పెల్లలో ఆదివారం జనసేన పార్టీ నేతలు బారీ సంఖ్యలో వైఎస్సార్ సీపీలోకి చేరారు. ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతా మహాలక్ష్మి, యూత్ రాష్ట్ర కార్యదర్శి దియ్యన పెదకాపు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు ఆధ్వర్యంలో సుమారు 200 మంది పార్టీ శ్రేణులు కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. ఆయన పార్టీలో చేరిన వారందరికీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. సీఎం వైఎస్ జగన్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఆకర్షితులై పార్టీలో చేరిన వారందరికి సముచిత స్థానం కల్పిస్తానని హామీ ఇచ్చారు. పార్టీలో చేరిన వారిలో దామోదర సత్యనారాయణ, బి.పెదయేసు, కోన పట్టాభి, భావన అర్జున్, ఆకుల అర్జున్, కొత్తపల్లి దుర్గయ్య, ఆకుల నాగన్న తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ పేదల పక్షపాతిగా ఉన్నారని, సంక్షేమంతో అనేక మంది పేదలను ఆర్థికంగా బలోపేతం చేసారని కొనియాడారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే జగ్గిరెడ్డిని నాలుగోసారి భారీ మెజారిటీతో గెలిపించుకుని సీఎం జగన్‌కు కానుకగా ఇస్తామని పేర్కొన్నారు. మాజీ ఎంపీపీ తోరాటి రాంబాబు, ఉప సర్పంచ్ తోరాటి దుర్గారావు, దొండపాటి చంటి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి నామినేషన్



పి.గన్నవరం: వైఎస్సార్ సీపీ పి.గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు సోమవారం ఉదయం 11 గంటలకు స్థానిక ఆర్ఓ కార్యాలయంలో నామినేషన్ వేయనున్నారు. ఉదయం 10 గంటలకు స్థానిక పార్టీ కార్యాలయం నుంచి మూడు రోడ్ల సెంటర్ వరకూ పార్టీ శ్రేణులతో భారీ ఊరేగింపు జరుగుతుంది. తన నామినేషన్ కార్యక్రమానికి నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ కుటుంబ సభ్యులు, అభిమానులు, కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో తరలిరావాలని విజ్ఞప్తి చేశారు.

అయినవిల్లి: వైఎస్సార్ సీపీ అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు నామినేషన్ కార్యక్రమానికి అయినవిల్లి మండలం నుంచి భారీ ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని అయినవిల్లి మండల వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కుడుపూడి విద్యాసాగర్ ఆదివారం పిలుపు నిచ్చారు.

నరసన్న సన్నిధిలో ఎమ్మెల్సీ కవురు



అంతర్వేది ఆలయంలో ఎమ్మెల్సీ కవురు, ఎమ్మెల్యే అభ్యర్థి నరసింహరాజు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో ఆదివారం ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, పశ్చిమ గోదావరి జిల్లా ఉండి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పి.వి.ఎల్.నరసింహరాజు స్వామికి పూజలు చేశారు. స్వామివారి ప్రసాదాన్ని ఆలయ సిబ్బంది అందజేశారు. వెంట నాయకుడు సరెళ్ల విజయ్ ప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా శ్రీరామ చైతన్య యాత్ర



గూడపల్లిలో సాగిన శ్రీరామ చైతన్య యాత్ర

మలికిపురం: మండలంలోని గూడపల్లిలో 104 పల్లకీలతో శ్రీరామ చైతన్య యాత్ర కార్యక్రమం ఆదివారం మధ్యాహ్నం ఘనంగా జరిగింది. గ్రామంలో సుందరి వారి మెరక రామాలయం నుంచి నూకాలమ్మ అమ్మవారి ఆలయం వరకు శ్రీరామ చైతన్య యాత్ర నిర్వహించారు. వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. బ్రాహ్మణ సేవా సంఘం వారి ఆధ్వర్యంలో సుందర బ్రహ్మయ్య, కొల్లు శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ అభ్యర్థి జగ్గిరెడ్డి నామినేషన్



కొత్తపేట: స్థానిక ఎమ్మెల్యే, అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డి సోమవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. కోనసీమ ముఖద్వారం రావులపాలెంలో పార్టీ కార్యాలయం నుంచి వేలాదిగా మోటార్‌సైకిళ్లు, ఆటోలు, చిన్నకార్లతో భారీ ఊరేగింపు, ర్యాలీగా అభ్యర్థి జగ్గిరెడ్డిని నామినేషన్‌కు వేళ్లేందుకు నాలుగు మండలాల పార్టీ శ్రేణులు కార్యక్రమాన్ని ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. నియోజకవర్గంలో ప్రతి గ్రామం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో పాటు ప్రజలు జగ్గిరెడ్డి నామినేషన్ కార్యక్రమంలో పాల్గొనున్నారు. అందరూ ఉదయం 9 గంటలకు రావులపాలెం పార్టీ కార్యాలయం వద్దకు చేరుకోవాలని పిలుపునిచ్చారు. అక్కడ కళా వెంకట్రావు సెంటర్‌లో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి, మాజీ ఎమ్మెల్యే చిర్ల సోమసుందరరెడ్డి విగ్రహాలకు అభ్యర్థి జగ్గిరెడ్డి పూలమాలలు వేసి, నివాళులర్పించిన అనంతరం అక్కడి నుంచి భారీ ర్యాలీగా కొత్తపేట బోడిపాలెం వంతెన సమీపంలోని బాబా ఆలయం వద్దకు చేరుకుంటారు. అక్కడ ఉన్నవారంతా జగ్గిరెడ్డి ర్యాలీకి ఘన స్వాగతం పలికి ర్యాలీలో పాల్గొంటారు. అక్కడి నుంచి కొత్త బస్టాండ్ మీదుగా పాత బస్టాండ్‌కు చేరుకుని అక్కడ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జాతి నేతల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి, మెయిన్‌రోడ్, కమ్మిరెడ్డిపాలెం, మారుతీ సెంటర్ మీదుగా ఆర్‌డీఓ కార్యాలయానికి ర్యాలీ చేరుకుంటుంది. 12.35 గంటలకు ఆర్‌డీఓ, ఎన్నికల అధికారికి జగ్గిరెడ్డి నామినేషన్లు దాఖలు చేస్తారని కొత్తపేటలో పార్టీ నాయకులు తెలిపారు. నామినేషన్ అనంతరం ఆ సమీపంలోనే దెందులూరి వీరభద్రం నగర్‌లో పార్టీ నాయకులు భోజన ఏర్పాట్లు చేశారు. జగ్గిరెడ్డి ర్యాలీ తదితర ఏర్పాట్లపై ఆదివారం మధ్యాహ్నం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద అముడ చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధర రావు, మండల పార్టీ అధ్యక్షుడు ముత్యాల వీరభద్ర రావు, సర్పంచ్ రెడ్డి చంటి, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి ముసునూరి వెంకటేశ్వరరావు, మండల సేవాదళ్ అధ్యక్షుడు గూడపాటి ప్రవీన్‌కుమార్, గ్రామ పార్టీ అధ్యక్షుడు సలాది బ్రహ్మాజీ తదితరులు చర్చించారు.

వైఎస్సార్ సీపీలో చేరికలు



ఊడిమూడిలంకలో పార్టీలో చేరిన కార్యకర్తలకు వైఎస్సార్ సీపీ కండువాలు వేస్తున్న విప్పర్తి

పి.గన్నవరం: వైఎస్సార్ సీపీకి ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తుండడంతో ఊడిమూడిలంకలో టీడీపీకి చెందిన 25 కుటుంబాలు మండల పార్టీ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలో చేరాయి. పార్టీలో చేరిన కోట సత్యనారాయణ, అయినపర్తి సత్యనారాయణ, కుసుమ శామ్యూల్, పరమట శ్రీను తదితరులకు ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి వేణు గోపాలరావు వైఎస్సార్ సీపీ కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీని అధికారంలోకి తీసుకు రావడమే లక్ష్యంగా పార్టీ కార్యకర్తలు పనిచేయాలని అన్నారు. కార్యక్రమంలో మండల జేసీఎస్ కన్వీనర్ దొమ్మేటి దుర్గారావు, నాయకులు నేతల శ్రీను, పమ్మి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జోరుగా వరి కోతలు



కె.పెదపూడిలో కోత యంత్రంతో జరుగుతున్న వరి మాసూళ్లు

అంబాజీపేట: వరి కోతలు జోరందుకున్నాయి. ముందుగా ఊడ్చిన చేలు తక్కువ కాలంలోనే పక్వానికి రావడంతో రైతులు కోతలు చేస్తున్నారు. రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. మండలంలో అంబాజీపేట, మాచవరం, గంగలకుర్రు, గంగలకుర్రు అగ్రహారం, మొసలపల్లి, వక్కలంక, ఇరుసుమండ, ముక్కామల, పుల్లేటికుర్రు, పసుపల్లి, చిరతపూడి, ఇసుకపూడిలో కోతలు జరుగుతున్నాయి. ఈ సారి వరి కోతలకు యంత్రాలను ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. గతేడాది మండలంలో 60 శాతం వరి కోతల్లో యంత్రాలను వినియోగించగా, ఈ సారి 90 శాతం దాటవచ్చని అంచనా వేస్తున్నారు. దీంతో కొన్ని ప్రాంతాలకు మాత్రమే వ్యవసాయ కూలీలు పరిమితమవుతున్నారు. యంత్రాల ద్వారా ఎకరానికి రూ.2500 ఖర్చవుతుండగా కూలీలు, కోత కోయడానికి రూ.1500, తిరిగి పనలు కట్టి, మాసూలు చేయడానికి రూ.3 నుంచి రూ.4వేలు అవుతున్నాయి. దీంతో అధిక శాతం రైతులు వరి యంత్రాల వైపే మొగ్గు చూపుతున్నారు. నేలతడి ఆరని ప్రాంతాల్లో తప్పని పరిస్థితుల్లో కూలీలను వినియోగిస్తున్నారు. మండలంలో 2998 ఎకరాల్లో వరి సాగు చేపట్టగా ఇప్పటి వరకూ 300 ఎకరాల్లో వరి కోతలు పూర్తయ్యాయి.

అంతా కృష్ణమయమే..



ప్రసంగిస్తున్న సుందర శ్రీనివాసదాసు ప్రభుజీ

అయినవిల్లి: ఈ అనంత లోకాలు కృష్ణమయమే, ఆయన మెచ్చేటట్టు మనం జీవించాలని, అప్పుడు మానవ జీవితం శార్ధకమవుతోందని నల్లచెరువు గ్రామంలోని అంతర్జాతీయ శ్రీకృష్ణ మందిర్ నిర్వాహకుడు, ప్రభుజీ సుందర శ్రీనివాసాదాస్ అన్నారు. ఆదివారం నల్లచెరువు గ్రామంలో శ్రీకష్ణుని తత్వాన్ని శ్రీనివాసదాస్ బోధించారు. భగవత్ గీత మన రాతను మారుస్తోందన్నారు. భగవత్ గీతను విన్నా చదివినా జన్మ చరితమవుతోందన్నారు. భగవంతుడు సూచించిన దారిలోనే మనం ప్రయాణించాలని ఆయన సూచించారు. ఆయన సేవలో తరించిన వారికే మోక్షం లభిస్తుందన్నారు. దేవాదిదేవుడు సేవ చేయడం కూడా పూర్వజన్మ శుక్రుతమే అన్నారు. అనంతరం భక్తులు స్వామి అన్నప్రసాదం స్వీకరించారు.

ప్రతి ఇంటా సంక్షేమమేనంట..

- రాజోలు అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గొల్లపల్లి
- పొన్నమండలో ఇంటింటా ప్రచారం



పొన్నమండలో ఇంటింటా ప్రచారంలో పాల్గొన్న గొల్లపల్లి

రాజోలు: ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏ ఇంటికి వెళ్లినా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ ఫలాలే దర్శనమిస్తున్నాయని రాజోలు అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. ఆదివారం పొన్నమండలో గొల్లపల్లి సూర్యారావు ముమ్మరంగా ఇంటింటా ప్రచారం నిర్వహించారు. రాబోయే ఎన్నికల్లో రాజోలు అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావును, అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి రాపాక వరప్రసాదరావుకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామని పొన్నమండవాసులు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా గొల్లపల్లి మాట్లాడుతూ మళ్లీ సీఎంగా జగన్ మోహన్ రెడ్డినే ప్రజలు కోరుకుంటున్నారన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు కట్టా శ్రీనివాసరావు, పార్టీ నాయకులు దాకే సురేష్, చిత్రపు కిషోర్‌చెన్నారెడ్డి కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆలమూరు: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని రామచంద్రపురం ఈఈ వై.విజయానంద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటలకు వరకూ నర్సిపూడి, నవాబుపేట, గుమ్మిలేరు, మోదుకూరు, ఆలమూరు-ఏ, చింతలూరు తదితర గ్రామాలకు విద్యుత్ నిలిపివేయనున్నామన్నారు.

నయనానందకరం సదస్యం



ప్రత్యేక అలంకరణలో శ్రీజగన్మోహినీ కేశవ స్వామి



సదస్యం కార్యక్రమం నిర్వహిస్తున్న పండితులు

ఆత్రేయపురం: పురాణ ప్రసిద్ధి చెందిన ఆత్రేయపురం మండలం ర్యాలి శ్రీజగన్మోహినీ కేశవ స్వామి ఆలయంలో ఆదివారం సదస్యం కార్యక్రమాన్ని వేద పండితులు , అర్చకులు కన్నుల పండుగగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తిలకించారు. వేకువ జామునే స్వామి వారి గ్రామోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు తదితర కార్యక్రమాలను వేదపండితులు మంత్రాల పఠనంతో నిర్వహించారు. వేకువ జాము నుంచే భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఈఓ బి.కృష్ణ చైతన్య ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సీఎం జగన్‌ను కలిసిన శివకుమార్



సీఎం జగన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన శివకుమార్

సఖినేటిపల్లి: విశాఖపట్నం పర్యటనలో ఉన్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని, ఆదివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా బూత్ కమిటీల కో ఆర్డినేటర్, జగ్గంపేట వైఎస్సార్ సీపీ పరిశీలకుడు పాటి శివకుమార్ మర్యాద పూర్వకంగా కలిశారు. తనకు అప్పగించిన ప్రతి బాధ్యతను నెరవేరుస్తున్నందుకు గాను సీఎం జగన్ తనను అభినందించారని మండల పరిధిలోని రామేశ్వరానికి చెందిన శివకుమార్ ఈ మేరకు మీడియాకు తెలిపారు.

వైఎస్సార్ సీపీకి మద్దతుగా..



ద్రాక్షారామ బియ్యంపేట రామాలయం వద్ద ప్రచారం నిర్వహిస్తున్న శెట్టిబలిజ సంఘ పెద్దలు

శెట్టిబలిజ సంఘ ఎన్నికల ప్రచారం

రామచంద్రపురం రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో వైఎస్సార్ సీపీకి మద్దతుగా శెట్టిబలిజ సంఘ పెద్దలు కట్టా సూర్యనారాయణ, ఇళ్ల సూర్యనారాయణ, నరాల ఏడుకొండలు, కొప్పిశెట్టి ఏడుకొండలు, గుత్తుల నాగబాబు, పంపన విజయదుర్గాప్రసాద్ తదితరులు ఆదివారం ఎన్నికల ప్రచారం చేశారు. కె.గంగవరం మండలంలోని కోటిపల్లి, కుడుపూరు, పంపనవారిపాలెం తదితర గ్రామాలతో పాటు రామచంద్రపురం మండలంలోని ద్రాక్షారామ బియ్యంపేట, ఆదివారపుపేట గ్రామాల్లో పర్యటించి వైఎస్సార్ సీపీకి మద్దతు ఇవ్వాలని స్థానికులను కోరారు.

కన్నుల పండువగా తెప్పోత్సవం



పుష్కరిణిలో విహరిస్తున్న కోనేటి రాయుడు

శేషవాహనంపై ఊరేగిన కోనేటి రాయుడు

అమలాపురం టౌన్: అమలాపురం వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో జరుగుతున్న స్వామి వారి కల్యాణోత్సవాల్లో భాగంగా కోనేటి రాయుని తెప్పోత్సవం ఆదివారం రాత్రి కన్నుల పండువగా నిర్వహించారు. ఆదివారం రాత్రి స్వామి, అమ్మవార్లు పుష్కరిణిలో కాసేపు విహరించారు. గర్భగుడిలో కొలువై ఉన్న స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను పల్లకీపై పుష్కరిణికి తోడ్కుని వచ్చి విద్యుత్ దీపాలు, పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించిన శేషవాహనంపై ఆశీనులను చేశారు. దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ దూడల వెంకట వీరీతాదేవి, ఈఓ దూనబోయిన సాయిబాబు, ధర్మకర్తలు, అర్చకులు స్వామి, అమ్మవార్లకు తొలుత ప్రత్యేక పూజలు చేసి తెప్పోత్సవాన్ని ప్రారంభించారు. తెప్పోత్సవం సందర్భంగా దేవస్థానం ప్రాంగణంలోని కోనేరు(పుష్కరిణి)ని విద్యుత్ దీపాలతో నయనానందకరంగా అలంకరించారు. మిరుమిట్లు గొలిపే వెలుగుల నడుమ శేష వాహనంపై కోనేటి రాయుడు తెప్పోత్సవాన్ని వేలాది మంది భక్తులు తిలకించారు. తెప్పోత్సవం జరుగుతుండగా భక్తుల గోవిందనామ స్మరణతో దేవస్థాన ప్రాంగణం మారుమోగింది. కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం 3.32 గంటలకు స్వామి వారి సదస్యం క్రతువును అర్చక స్వాములు నిర్వహించారు. అబ్బిరెడ్డి సురేష్, సంధ్యారాణి దంపతులు, వైఎస్సార్ సీపీ పట్టణ యువజన కమిటీ అధ్యక్షుడు దూడల ఫణి, పట్టణ వైశ్య సంఘం నాయకుడు యెండూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దాతలు ముందుకు రావాలి



చలి వేంద్రాన్ని ప్రారంభించి మజ్జిగ పంపిణీ చేస్తున్న జిల్లా కలెక్టర్ శుక్లా, ఆయన కుమారుడు రియెన్ను

అమలాపురం టౌన్: వేసవిలో వాహన చోదకులు, బాటసారుల దాహార్తిని తీర్చేందుకు దాతలు ముందుకొచ్చి చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి వద్ద ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని కలెక్టర్ శుక్లా తన తండ్రి ఎంఎల్ శుక్లా, కుమారుడు రియెన్షుతో కలిసి ఆదివారం మధ్యాహ్నం ప్రారంభించి ప్రజలకు మజ్జిగ అందజేశారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో చిన్నారులు, వృద్ధులు రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ సూచనలు విధిగా పాటించి జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ శుక్లా సూచించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకరరావు, ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది, టీఎన్‌టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు వలవల శివరావు తదితరులు పాల్గొన్నారు.

చెక్‌పోస్టుల్లో విస్తృత తనిఖీలు

ఐ.పోలవరం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో చెక్‌పోస్టుల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఎదుర్లంక వారధి వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులో పోలీసులు, ఎస్ఈబీ, ప్రత్యేక దళాలు 24 గంటలూ తనిఖీలు చేస్తున్నారు. జిల్లా ఎస్పీ శ్రీధర్, ఏఎస్పీ ఎస్.ఖాదర్ బాషా ఆదేశాల మేరకు ఎస్ఐ జె.భానుప్రసాద్ ఆదివారం వాహనాలు, కార్లు, కంటైనర్లను తనిఖీలు చేసి కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలిచ్చారు. ఎవరైనా మద్యం, నగదు రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.



ఎదుర్లంక చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు